దుర్గా మాతా నమోస్తుతే

- ఘనంగా ప్రారంభమైన శరన్నవరాత్ర మహోత్సవాలు
- అమ్మవారి ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ

అమలాపురం టౌన్: దసరా ఉత్సవాల్లో భాగంగా స్థానిక శ్రీదేవి మార్కెట్‌లో వేంచేసి ఉన్న శ్రీదేవి అమ్మవారి ఆలయంలో తొలిరోజు ఆదివారం అమ్మవారు స్వర్ణ కవచాలంకృత దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారిని వేలాది మంది దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు కుంకుమ పూజలు చేశారు. శ్రీదేవి ఉత్సవ కమిటీ చైర్మన్ గంగాబత్తుల రాంబాబు ఆధ్వర్యంలో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. స్థానిక శ్రీదేవి మార్కెట్‌లో వేంచేసి ఉన్న శ్రీదేవి అమ్మవారి ఆలయంలో అమ్మవారిని తొలుత పల్లకీలో ఉంచి గోదావరి జలాలతో ప్రవహించే అమలాపురం ప్రధాన పంట కాలువ వద్దకు తీసుకెళ్లారు. పంట కాలువలో అమ్మవారికి మంగళ స్నానం చేయించి అదే పల్లకీలో మళ్లీ ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చి శరన్నవరాత్ర మహోత్సవాలకు శ్రీకారం చుట్టారు. స్థానిక శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద గోదావరి జలాలతో కూడిన 108 కలశాలతో మహిళలు పుర వీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు. భక్తుడు పచ్చిగోళ్ల ప్రభాకరరావు సహకారంతో పచ్చిగోళ్ల రామకృష్ణ, వాణి దంపతులు అమ్మవారికి బహూకరించిన రూ.20 లక్షల విలువైన 25 కిలోల బరువున్న వెండి పల్లకీకి సంప్రోషణను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారిని ఆ వెండి పల్లకీలో ఉంచి ఊరేగించారు. స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట వినీతాదేవి శరన్నవ రాత్ర ఉత్సవాలను ప్రారంభించారు.

ఉత్సవ కమిటీలకు సహకరించాలి

పట్టణం, పరిసర గ్రామాల్లో శరన్నవ రాత్ర మహోత్సవాలు, ఊరేగింపులు నిర్వహించే కమిటీలకు పోలీసులు సహకరించాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ సూచించారు. ఉత్సవాల్లో భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా పోలీసులు సున్నితంగా వ్యవహరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. శరన్నవ రాత్ర ఉత్సవాల ప్రారంభ కార్యక్రమాల్లో పట్టణంలోని ఓ ఆలయ నిర్వాహకుల నుంచి బాణసంచాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారన్న పరిణామాలపై మంత్రి విశ్వరూప్ స్పందించి పైవిధంగా సూచనలు చేశారు.


ముమ్మిడివరంలో అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు

అమ్మవారికి ప్రత్యేక పూజలు

ఉప్పలగుప్తం: మండలంలోని కూనవరం, విలసవిల్లి, గాడవిల్లి, చల్లపల్లి, వానపల్లిపాలెం గ్రామాల్లో ఆదివారం ఉదయం అమ్మవారి ఉత్సవాలకు కలస్థాపన చేశారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని సామూహిక కుంకుమ పూజలు చేసి మొక్కుబడులు చెల్లించుకున్నారు. వానపల్లిపాలెంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి అన్న సమారాధన జరిపారు. భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

శరన్నవరాత్ర ఉత్సవాలు ఘనంగా ప్రారంభం

ముమ్మిడివరం: నియోజకవర్గంలో దసరా శరన్నవరాత్ర మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీ సత్రంలో వాసవీ అమ్మవారిని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. గేదెల్లంక త్రివేణి సంగమం నుంచి మహిళలు కలశాలతో గోదావరి పవిత్ర జలాలను తీసుకొచ్చి అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు.

ఐ.పోలవరం: మండలంలోని మురమళ్ల, కొమరగిరి, కేశనకుర్రు గ్రామాల్లోని కనకదుర్గ అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు. మురమళ్ల వాసవీ కన్యకా పరమేశ్వరి సత్రంలో దసరా ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో భద్రకాళీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.


వానపల్లిపాలెంలో ప్రత్యేక అలంకరణలో విజయదుర్గ అమ్మవారు


స్వర్ణ కవచాలంకృత దుర్గాదేవిగా దర్శనమిచ్చిన శ్రీదేవి అమ్మవారు


నీలపల్లిలో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

తాళ్లరేవు: మండలంలోని తాళ్లరేవు, సీతారామపురం, కోరంగి, చొల్లంగి, చొల్లంగిపేట, జార్జిపేట, పోలేకుర్రు, మల్లవరం, సుంకరపాలెం తదితర గ్రామాల్లోని ఆలయాల్లో అమ్మవారికి శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా విశేష పూజలు నిర్వహించారు. తాళ్లరేవు ప్రధాన రహదారిలో వేంచేసియున్న శ్రీవాసవీమాత ఆలయంలో అర్చకులు ఖండవిల్లి కేశవాచార్యులు అమ్మవారిని కనకదుర్గాదేవిగా అలంకరించి ప్రసాదాన్ని నివేదించారు.

అల్లవరం: మండలంలోని అల్లవరం మొల్లేటిగరువులోని విజయదుర్గ అమ్మవారిని ఎంపీ చింతా అనురాధ ఆదివారం దర్శించుకున్నారు. దేవగుప్తం సెంటర్లో కొలువై ఉన్న శ్రీవిజయదుర్గ అమ్మవారి ఆలయం వద్ద కలశస్థాపన నిర్వహించారు. గోడితిప్ప, డి.రావులపాలెం, కొమరగిరిపట్నం, సామంతకుర్రు, వెదుళ్లపాలెం తదితర గ్రామాల్లో దేవీ ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

యానాం: దేవీనవరాత్రులను పురస్కరించుకుని ఆదివారం స్థానిక దొమ్మేటిపేట కనకదుర్గాదేవి ఆలయం వద్ద జరిగిన పూజా కార్యక్రమాల్లో పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పాల్గొని పూజలు నిర్వహించారు.


దొమ్మేటిపేటలోని కనకదుర్గాదేవి ఆలయంలో మల్లాడి కృష్ణారావు

క్లుప్తంగా

భారత రిపబ్లికన్ పార్టీ నూతన కార్యవర్గం


నూతన కార్యవర్గంతో పార్టీ నాయకులు

ముమ్మిడివరం: మండల భారత రిపబ్లికన్ పార్టీ నూతన కార్యవర్గ ఎంపిక ఆదివారం జరిగింది. ముమ్మిడివరంలో ఆదివారం పార్టీ అధ్యక్షుడు గిడ్డి జ్ఞానప్రకాష్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి జిల్లా గౌరవాధ్యక్షుడు దడాల రామకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని నూతన కమిటీని ఎంపిక చేశారు. మండల పార్టీ అధ్యక్షుడిగా పాము అంబేడ్కర్, ఉపాధ్యక్షుడిగా మోకా అఖిల్, కార్యదర్శిగా గిడ్డి ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా పరమట రాంప్రసాద్, కోశాధికారిగా కాశి మురళి, వర్కింగ్ అధ్యక్షుడిగా జనిపెల్ల చంటిలను నియమించారు. కార్యక్రమంలో నల్లా సత్యనారాయణ, పంతగడ నరసింహమూర్తి, చీకురుమిల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పితృ దేవతా మహోత్సవాలు


శాంతి కర్మను నిర్వహిస్తున్న అక్షయ పాత్ర ప్రతినిధులు

అమలాపురం టౌన్: స్థానిక విద్యుత్ నగర్‌లోని ఆది శేష నిలయంలో అక్షయ పాత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో గత 18 రోజులుగా జరుగుతున్న పితృ దేవతా మహోత్సవాలు ఆదివారం మధ్యాహ్నం పూర్ణాహుతితో ముగిశాయి. శనివారం రాత్రి ఆదిశేష నిలయం ప్రాంగణంలో శాంతి కర్మను నిర్వహించిన మహిళలు చేసిన దీపాలంకరణ దేదీప్యమానంగా సాగింది. ఇక నుంచి ప్రతి నెలా బహుళ చతుర్థి, అమావాస్యలకు యమ ధర్మరాజు, పితృ దేవతా పూజలు నిర్వహిస్తామని అక్షయ పాత్ర వ్యవస్థాపకురాలు పోతురాజు నాగకనకదుర్గ తెలిపారు. అక్షయ పాత్ర ప్రతినిధులు లింగోలు శిరీష, నూకల ఏసుకుమారి, గొవ్వాల అచ్యుత రామయ్య, లింగోలు విస్సు, త్సవటపల్లి అన్నపూర్ణ తదితరులు భక్తులకు సేవలందించారు.

ఘనంగా అబ్దుల్ కలాం జయంతి


అబ్దుల్ కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ముమ్మిడివరం: మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలను పీపుల్స్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అణు పరీక్షల్లో భారతదేశాన్ని అణ్వస్త్ర రాజ్యాల సరసన చేర్చిన మహోన్నత వ్యక్తి ఏపీజే అబ్దుల్ కలాం అని పలువురు కొనియాడారు. కార్యక్రమంలో ఎ.సతీష్, పీపుల్స్ సర్వీస్ ఆర్గనైజేషన్ కార్యదర్శి కేబీవీ కిశోర్, కె.కిరణ్, ఎన్.రాంజీ, కె.కార్తిక్, జి.వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వీరేశ్వరస్వామి ఆలయంలో అహోరాత్ర పారాయణ

ఐ.పోలవరం: శరన్నవరాత్రులను పురస్కరించుకుని దేవదాయశాఖ ఈ నెల 17న లలితా సహస్ర నామ అహోరాత్ర పారాయణ కార్యక్రమాన్ని మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వర స్వామి ఆలయంలో ఏర్పాటుచేయనున్నట్లు ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజు, ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణలు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక


అనీష్ కార్తీక్

అమలాపురం రూరల్: రాజమహేంద్రవరంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి స్థాయిలో జరిగిన రైఫిల్ షూటింగ్ అండర్-17 పిస్టల్ విభాగంలో కామనగరువు ఆదిత్య పాఠశాల విద్యార్థి వాసిరెడ్డి యశోరామ అనీష్ కార్తీక్ జిల్లా 3వ స్థానం సాధించాడు. పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థి అనీష్ కార్తీక్‌ను ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, డైరెక్టర్ ఎన్.శృతిరెడ్డి, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్ చలపతిరావు తదితరులు అభినందించారు.

విద్యార్థులకు వితరణ

అమలాపురం రూరల్: సినీ హీరో సాయిధరమ్ తేజ్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈదరపల్లి హరిమనో వికాస కేంద్రంలో పట్టణ సాయిధరమ్‌తేజ్ ఫ్యాన్స్ అధ్యక్షుడు వాకాడ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో విద్యార్థులకు పండ్లు, బ్రెడ్లు, భోజనాలు అందజేశారు. కార్యక్రమంలో నల్లా చిట్టిబాబు, ఏడిది శ్రీను, నల్లా నాయుడు, సలాది సరేష్, అల్లు దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణ ప్రజలకు సురక్షిత తాగునీరు


వాటర్ వర్క్స్‌లో క్లారిఫిక్యులేటర్ బ్రిడ్జిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ సత్యనాగేంద్రమణి తదితరులు

అమలాపురం టౌన్: స్థానిక వాటర్ వర్క్స్‌లో తాగు నీటిని శుద్ధి చేసే ప్లాంట్‌ను రూ.35 లక్షలతో ఆధునీకరించడంతో ఇక నుంచి పట్టణ ప్రజలకు సురక్షితమైన తాగునీటి సరఫరా సాకారమవుతుందని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు అన్నారు. స్థానిక వాటర్ వర్క్స్ విభాగంలో ఆధునీకరించిన 4 ఎంఎల్‌డీ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లోని క్లారిఫిక్యులేటర్ బ్రిడ్జిని మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణితో కలిసి ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు ఆదివారం ప్రారంభించారు. దాదాపు నెల రోజుల పాటు వాటర్ వర్క్స్ సిబ్బంది శ్రమించారని మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, మున్సిపల్ వైస్ చైర్మన్లు తిక్కిరెడ్డి వెంకటేష్, రుద్రరాజు నానిరాజు, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, మున్సిపల్ ఇన్‌చార్జి డీఈఈ డి.సూర్యభాస్కరరావు, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆభరణాలు స్వాధీనం చేసుకోమంటే వినరేం?

యానాం: స్థానిక భూసమేత వేంకటేశ్వరస్వామివారి బంగారు, వెండి తదితర ఆభరణాలు, సంబంధిత రికార్డులను స్వాధీనం చేసుకోమని ఎన్నిసార్లు విన్నవించినా ప్రభుత్వ అధికారులు తీసుకోవడం లేదని దేవస్థానం కమిటీ మాజీ చైర్మన్ కాపగంటి ఉమాశంకర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక శివాలయంలో దేవస్థానం కమిటీ మాజీ సభ్యులంతా కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడారు. ఈ సందర్భంగా మాజీ చైర్మన్ కాపగంటి ఉమాశంకర్ మాట్లాడుతూ దేవస్థానానికి పాలకవర్గం కాలపరిమితి ముగిసిన నేపథ్యంలో తమ వద్ద ఉన్న స్వర్ణ కిరీటం, సువర్ణ పుష్పం, మంగళసూత్రాలు, 108 కాసుల ఆభరణం తదితర బంగారు ఆభరణాలతో పాటు ఫిక్స్‌డ్ డిపాజిట్లు, రికార్డులను డిప్యూటీ తహసీల్దార్‌కు అప్పగించాలని పుదుచ్చేరి దేవదాయశాఖ అధికారులు ఆదేశాలు జారీచేశారన్నారు. దీంతో వాటిని తీసుకోవాలంటూ లేఖలు రాస్తున్నా డిప్యూటీ తహసీల్దార్ నుంచి స్పందన లేదన్నారు. దీనివల్ల తాము నిందలకు గురి కావాల్సి వస్తుందన్నారు. దీనిపై ఆర్‌ఏఓ మునిస్వామిని వివరణ కోరగా స్వామివారి ఆభరణాలు పెట్టేందుకు ప్రస్తుతం యానాంలో ఉన్న బ్యాంకు లాకర్లు, ట్రెజరీ సైతం అనువుగా లేవన్నారు. త్వరలో సిద్ధమవుతున్న బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో ఆభరణాలను భద్రపరిచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న దేవస్థానం పాలక వర్గ మాజీ చైర్మన్ ఉమాశంకర్ తదితరులు

వ్యక్తిపై దాడి

అమలాపురం రూరల్: పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న ఓ వైన్ షాపు వద్ద జరిగిన ఘర్షణలో ఓ వ్యక్తిపై ఇద్దరు దాడికి పాల్పడినట్లు అమలాపురం తాలూకా ఎస్‌ఐ అందే పరదేశి ఆదివారం తెలిపారు. ఆయన చెప్పిన వివరాల ప్రకారం పాత గొడవల కారణంగా కామనగరువు పెట్రోల్ బంకు వద్ద హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన బడుగు శ్రీనుపై ఉప్పలగుప్తం మండలం పేరాయి చెరువుకు చెందిన ఇద్దరు వ్యక్తులు దాడి చేశారు. ఈ దాడిలో శ్రీను తీవ్రంగా గాయపడడంతో ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆరోగ్యం మీ చేతుల్లో


చేతుల శుభ్రంపై ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీఓ కృష్ణమోహన్ తదితరులు

అల్లవరం: గ్లోబల్ హ్యాండ్‌వాషింగ్ డేను పురస్కరించుకుని గోడిలంక సచివాలయంలో చేతులు శుభ్రం చేసుకునే విధానంపై ఎంపీడీఓ కృష్ణమోహన్ ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ అరచేతులు శుభ్రంగా ఉంచుకోవడంతో అనారోగ్యం దరిచేరదన్నారు. భోజనానికి ముందు, ఆ తర్వాత తప్పనిసరిగా సబ్బుతో చేతులను శుభ్రం చేసుకోవాలని సూచించారు. శుభ్రత పాటించకపోవడం వల్ల ఏటా లక్షలాది మంది చిన్నారులు రోగాల బారిన పడుతున్నారని తెలిపారు. పిల్లలకు చిన్నప్పటి నుంచి చేతులు శుభ్రం చేసుకునేలా అవగాహన కల్పించేలా తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వడ్డి గంగ, ఉప సర్పంచ్ రుద్రరాజు లక్ష్మీపతిరాజు తదితరులు పాల్గొన్నారు.


శ్రీరామ్‌నగర్‌లో చిన్నారులకు చేతులు కడగడంపై అవగాహన కల్పిస్తున్న వైద్యారోగ్య శాఖ సిబ్బంది

చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

తాళ్లరేవు: చేతులను ఎప్పటికప్పుడు సబ్బుతో శుభ్రం చేసుకోవడం ద్వారా అనారోగ్యానికి దూరంగా ఉండొచ్చని స్థానిక వైద్య సిబ్బంది సూచించారు. మండల కేంద్రమైన తాళ్లరేవు మాధవరాయునిపేటలోని శ్రీరామ్‌నగర్‌లో ఆదివారం గ్లోబల్ హ్యాండ్ వాష్ డేను నిర్వహించారు. ఆహారం తినేముందు, మల, మూత్రాలకు వెళ్లిన తరువాత చేతులను సబ్బుతో పరిశుభ్రంగా కడుగుకోవాలని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులచే చేతులు కడిగించి దాని ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

తాళ్లరేవు: యానాం నుంచి ఆంధ్రా ప్రాంతానికి ఆటోలో అక్రమంగా 140 మద్యం సీసాలను తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు తాళ్లరేవు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్‌ఐ ఎంవీవీబీ కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. తాళ్లరేవు వై.జంక్షన్ వద్ద నిర్వహించిన తనిఖీల్లో కాకినాడ మోచీవారి వీధికి చెందిన కండిపిల్లి దుర్గా ప్రసాద్, యలమంచిలి మండలం కొప్పాక గ్రామానికి చెందిన దార శ్రీనులను ఆటోలో మద్యం తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. వారిపై కేసు నమోదు చేసి ఆటోను సీజ్ చేశామన్నారు. నిందితులను కోర్టులో హాజరుపరుస్తామని ఎస్‌ఐ కుమార్ తెలిపారు. తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ ఎం.లక్ష్మణరావు, కానిస్టేబుల్స్ టి.దయాకరరావు, కె.వీరభద్రరావు, డి.శ్రీనివాసరావు, ఎం.వినయ్ పాల్గొన్నారు.


పట్టుబడిన అక్రమ మద్యం, నిందితులతో తాళ్లరేవు ఎస్‌ఈబీ ఎస్‌ఐ కుమార్, సిబ్బంది

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మూడోసారి మోకా సుబ్బారావు


మోకా వెంకట సుబ్బారావు

అమలాపురం రూరల్: బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మోకా వెంకట సుబ్బారావు మూడోసారి నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. సుబ్బారావు విద్యార్థి నాయకునిగా 1990 నుంచి బీజేపీ పార్టీలో కొనసాగుతూ పార్టీలో కీలక పదవులు చేపట్టారు. ఈ సందర్భంగా సుబ్బారావును జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా, కర్రి చిట్టిబాబు, దూరి రాజేష్ తదితరులు అభినందించారు.

జిప్‌మెర్‌లో వలంటీర్ల సేవలు

యానాం: పట్టణంలో త్వరలో ప్రారంభం కానున్న 100 పడకల జిప్‌మెర్ మల్టీస్పెషాలిటీ కన్సల్టింగ్ యూనిట్‌లో వలంటీర్ల సేవలు వినియోగించుకోనున్నట్లు పుదుచ్చేరి జిప్‌మెర్ డిప్యూటీ డైరెక్టర్(అడ్మిన్) డాక్టర్ కృష్ణగోపాల్‌గోయల్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. శాశ్వత ప్రాతిపదికన సిబ్బంది నియామకానికి కొంత సమయం పట్టనున్న నేపథ్యంలో స్వచ్ఛందంగా సేవలందించేందుకు ముందుకొచ్చే వలంటీర్ల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. జిప్‌మెర్‌లో ఆరు నెలల పాటు సేవలందించేందుకు అవకాశముంటుందన్నారు. మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్వహణలో అనుభవం, ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ఘనంగా ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు


స్వామివారికి పూజలు చేస్తున్న గురుదత్త బ్రాహ్మణ సేవా సమితి ప్రతినిధులు

యానాం: పట్టణంలో కొలువైన భూసమేత శ్రీవేంకటేశ్వరస్వామివారి 21వ బ్రహ్మోత్సవాలు ఆదివారం రాత్రి వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా శ్రీవైఖానస ఆగమ విద్వాన్ శ్రీమాన్ వాడపల్లి గోపాలాచార్యులు పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మొదటిరోజు శ్రీగురుదత్త బ్రాహ్మణ సేవా సమితి ఉత్సవదారులుగా స్వామివారికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుప్రభాతసేవ, మంగళ ధ్వని, పంచామృతాభిషేకం, సువర్ణ పుష్పార్చన, ముత్యాల హారతి, సహస్ర నామార్చన, నీరాజన మంత్రపుష్పములు, ప్రసాద వితరణ జరిగింది.

నిత్యాన్నదానానికి రూ.25,002 విరాళం


దాత రామారావుకు స్వామి చిత్రపటం అందజేస్తున్న ఆలయ సూపరింటెండెంట్

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి ఉప్పలగుప్తం మండలం ఎస్.కొత్తపల్లికి చెందిన వయ్యూరి రామారావు రూ.25,002 విరాళం అందజేశారు. ఈ సొమ్మును ఆలయ సూపరింటెండెంట్ శ్రీనివాసరాజుకు అందజేశారు. దాతను ఆలయ అర్చకులు వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

సొంతిల్లు.. సంతోషాల హరివిల్లు


మురమళ్లలో జగనన్న కాలనీ

- జగనన్న కాలనీల్లో జోరుగా గృహ నిర్మాణాలు
- కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పన

ఐ.పోలవరం: రాష్ట్రంలో ఇళ్లు లేని పేదలెవరూ ఉండకూడదన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యం. నవరత్నాల్లో పేదలందరికీ ఇళ్లు కల్పిస్తామనే హామీ మేరకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తొలి రోజు నుంచి అందుకు అనుగుణంగా అడుగులు వేస్తోంది. గ్రామ, పట్టణాల్లో నిరుపేదలకు గూడు కల్పించేందుకు పెద్ద ఎత్తున భూములు సేకరించి ఇళ్ల పట్టాలు ఇవ్వడమే కాకుండా వారు ఇళ్ల నిర్మాణాలు చేపట్టే విధంగా నిధులు మంజూరు చేసింది. అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల పరిధిలో అమలాపురం మున్సిపాలిటీ, ముమ్మిడివరం అర్బన్ ప్రాంతాలతో పాటు అల్లవరం, ఉప్పలగుప్తం, అమలాపురం, ఐ.పోలవరం, ముమ్మిడివరం, తాళ్లరేవు మండలాల్లో పెద్ద ఎత్తున ఇళ్ల నిర్మాణాలు చేపట్టింది. దీనివల్ల చాలా చోట్ల కొత్త కాలనీలు ఏర్పడ్డాయి.

అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల పరిధిలో మొత్తం 7,645 ఇళ్ల నిర్మాణాలు చేయాల్సి ఉండగా 2,739 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. మరో 2,833 నిర్మాణ దశలో ఉన్నాయి. వివిధ కారణాలతో ఇంకా 2,073 ఇళ్ల నిర్మాణాలు మొదలు కాలేదు. అమలాపురం పట్టణ పరిధిలో సుమారు 959 మంది పేదలకు ఇళ్ల నిర్మాణాల కోసం అల్లవరం మండలం బోడసకుర్రు, అమలాపురం మండలం తాండవపల్లిలో స్థలాలను సేకరించారు. బోడసకుర్రులో టిడ్కో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసిన ప్రభుత్వం లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. అలాగే ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలో పల్లిపాలెం, మట్టాడివారిపాలెంలో ఇళ్ల నిర్మాణాలకు స్థలాలు సేకరించారు. ఇక్కడ ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. రెండు నియోజకవర్గాల పరిధిలో అత్యధికంగా అమలాపురం మండలంలో 2,015 ఇళ్ల నిర్మాణాలను ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లో ఇళ్ల నిర్మాణాల వివరాలు

మండలం	ఇళ్ల మంజూరు	పూర్తయినవి	నిర్మాణంలో ఉన్నవి
ఉప్పలగుప్తం	128	39	89
అమలాపురం పట్టణం	959	244	345
అమలాపురం రూరల్	2,015	238	379
అల్లవరం	521	78	190
ముమ్మిడివరం	432	121	255
ముమ్మిడివరం అర్బన్	1,167	664	315
ఐ.పోలవరం	774	255	408
తాళ్లరేవు	1,952	1,100	852
మొత్తం	7645	2739	2833

సొంతింటి కల నెరవేరింది



జగనన్న నవరత్నాల వల్ల మా సొంతింటి కల నెరవేరింది. ప్రస్తుతం మా కుటుంబమంతా కొత్తగా కట్టుకున్న ఇంట్లోనే ఉంటున్నాం. కాలనీలో ఇప్పటికే చాలా ఇళ్లు కట్టుకున్నారు. వీధి దీపాలతో పాటు తాగునీటికి బోర్లు సైతం వేయించారు. రహదారులు, డ్రైనేజీ సౌకర్యాల పనులు జరుగుతున్నాయి.

– శీలం నాగమల్లేశ్వరి, మురమళ్ల, జగనన్న కాలనీ